క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం


విరాళం అందిస్తున్న చక్రధర్‌గౌడ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఎల్లమ్మ బోనాలు తీశారు. అలాగే ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు. రూ.51,111 ఆలయానికి విరాళంగా అందజేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

భక్తి శ్రద్ధలతో హోమం


లద్నూరులో హోమం చేస్తున్న హనుమాన్ భక్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సయపల్లి, లద్నూరు గ్రామాల్లో హనుమాన్ హోమం, మహాయజ్ఞాలు జరిగాయి. మంగళవారం లద్నూరు, నర్సయపల్లి హనుమాన్ స్వాములు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో హనుమాన్ హోమం, మహాయజ్ఞలను వైభవంగా నిర్వహించారు. నర్సయపల్లి గ్రామంలో జరిగిన హోమ కార్యక్రమంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రం పాడి పంటలతో కళకళలాడాలని, ప్రజలు ఆయురోగ్యాలతో బాగుండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమి కబ్జా


కబ్జా చేసిన గ్రామకంఠం భూమి ఇదే

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజీపేట గ్రామంలో గ్రామకంఠం భూమిని కబ్జా చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సుమారు మూడు గుంటల స్థలాన్ని ఆక్రమించి చుట్టూ కంచె వేశాడని గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో అభివృద్ధి పనులకు స్థలం లేకుండా పోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. పలుమార్లు గ్రామ కార్యదర్శికి, మండల రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హనుమాన్ మాలధారులకు భిక్ష


కుకునూరుపల్లిలో భిక్ష స్వీకరిస్తున్న హనుమాన్ స్వాములు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో న్యాలపోగుల హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం వంద మంది హనుమాన్ దీక్షా స్వాములకు భిక్ష (ఒక్క పూట భోజనం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జై హనుమాన్, జైజై హనుమాన్ భక్తి గీతాలతో ఆ ప్రాంతం మారుమోగింది.

జీలుగ విత్తనాలు లేక అవస్థలు

కొమురవెల్లి(సిద్దిపేట): జీలుగ విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో మండలంలోని రైతులు అవస్థలు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే జీలుగ విత్తనాలను సరిపడా సరఫరా చేయాలన్నారు. విత్తనాలు అరకొరగా రావడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి జీలుగ విత్తనాలను అందజేయాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

చేతికందే ఎత్తులో..


పొలాల్లో విద్యుత్ తీగలు యమపాశాల్లా వేలాడుతున్నాయి. చేతికందే ఎత్తులో ప్రమాదాలకు నిలయంగా మారాయి. వ్యవసాయ పనులను భయం భయంగా చేస్తున్నారు. అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధి దాస్‌తండాకు చెందిన గుగులోతు కిష్టునాయక్ పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వైర్లను సరిచేయాలని కోరుతున్నాడు. - అక్కన్నపేట(హుస్నాబాద్)

కంచెలేని స్థితిలో..





జనావాసాల మధ్య కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో నిత్యం జన సంచారం ఉండే యూనియన్ బ్యాంక్, పీహెచ్‌సీ గేటు ఎదురుగా, స్థానిక పెద్ద చెరువు, ప్రాథమిక పాఠశాల వద్ద, అందె రోడ్ల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. - మిరుదొడ్డి(దుబ్బాక)

శోభాయాత్ర .. పల్లకీ సేవ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో హనుమాన్ దీక్షా స్వాములు మంగళవారం హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చిత్ర పటాన్ని అలంకరించి గ్రామ ప్రధాన వీధుల గుండా భజనలు చేస్తూ ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

తోటపల్లిలో..

మండలంలోని తోటపెల్లిలోని రామాలయంలో మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు మంగళవారం హనుమాన్ పూజలు చేసి, దీక్ష చేపట్టిన స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

దుబ్బాక: వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక వీరాంజనేయ ఆలయం వద్ద స్వాములు హనుమత్ యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితుడు వేలేటి రామకృష్ణ శర్మ, స్వాములు పాల్గొన్నారు.


సిద్దిపేటలో హనుమాన్ పల్లకీ సేవ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖండ హనుమాన్ చాలీసా పఠనం జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగింది. హనుమాన్ స్వాములు మంగళవారం ఉదయం నుండే ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు హనుమాన్ పల్లకీ సేవలో పాల్గొన్నారు.

లోతు దుక్కులపై దృష్టి పెట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు లోతు దుక్కులపై దృష్టి పెట్టాలని, వేసవిలో కురిసే వర్షాల వల్ల భూమికి మేలు జరుగుతుందని ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల శాస్త్రవేత్తలు డాక్టర్ పల్లవి, విజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని అలిరాజీపేట గ్రామంలో వేసవి దుక్కులు, మట్టి నమూనా సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిని దున్నకుండా ఖాళీగా ఉంచటం వల్ల భూమి లోపల పొరలోని నీరు ఆవిరి అయిపోతుందన్నారు. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెంది తర్వాత వేసే పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. వేసవిలో లోతు దుక్కుల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వేసవిలో కురిసే వర్షాలకు ముందు భూమిని దున్నటం వల్ల తొలకరి వర్షాలు పడగానే మట్టి పెళ్లలు మెత్తబడతాయని వివరించారు. మూడేళ్లకు ఒకసారి రైతులు భూసార పరీక్షలు చేయించాలని, దీంతో భూమిలో పోషకాలు ఎంత మోతాదులో ఉన్నయో తెలుసుకుని వేసే పంటను బట్టి అవసరమైన ఎరువులను వాడొచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు శరణ్య, సమత రైతులు పాల్గొన్నారు.


అలిరాజీపేటలో వేసవి దుక్కులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విత్తనాల కోసం రైతుల పడిగాపులు


దుబ్బాకలో జీలుగ విత్తనాల కోసం క్యూలో నిలుచున్న రైతులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మండలంలో జీలుగ విత్తనాలు దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే రైతులు విత్తనాల కోసం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం దుబ్బాక ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి జీలుగ విత్తనాల లోడ్ లారీ వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఎండని సైతం లెక్క చేయకుండా విత్తనాల కోసం కేంద్రం వద్ద పడిగాపులు కాయల్సివచ్చింది. ఓపికగా లైన్‌లో నిలుచున్నా చివరకు విత్తనాలు దొరక్కపోవడంతో సంబంధిత అధికారులపై రైతులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

పాఠశాల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలి


కుట్టు పనిని పరిశీలిస్తున్న డీపీఎం విద్యాసాగర్

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థుల యూనిఫాం కుట్టుపని పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు విద్యాసాగర్ అన్నారు. మంగళవారం పోతారం(ఎస్)లోని స్త్రీ శక్తి టైలరింగ్ యూనిట్‌ను సందర్శించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాం కుట్టుపనిని మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, సీసీ యాదగిరి తదితరులు ఉన్నారు.

జాతీయ క్రీడలకు మిరుదొడ్డి క్రీడాకారులు


పర్శరాములు, పవన్

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ స్థాయి యూనివర్సిటీ క్రీడా పోటీలకు మిరుదొడ్డికి చెందిన ఇద్దరు క్రీడాకారులు పర్శరాములు, పవన్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 31 నుంచి జూన్ 3వ తేదీ వరకు తమిళనాడులోని జెప్పియార్ యూనివర్శిటీలో జరిగే బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. ఒకే గ్రామం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వేంనరేందర్ రెడ్డిని కలిసిన దరిపల్లి చంద్రం


వేంనరేందర్‌రెడ్డితో టీపీసీసీ సభ్యుడు చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం వ్యవహారాల ప్రధాన సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు టీపీసీసీ సభ్యుడు దరిపల్లిచంద్రం తెలిపారు. సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారన్నారు. నర్సింగ్ కళాశాలతో పాటుగా, పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: విద్యాసేవ చేస్తున్న డీఎస్‌ఎం పాఠశాల కరస్పాండెంట్ మిద్దెల యాదగిరిను మరింత సేవ చేసే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం డీఎస్‌ఎం పాఠశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరి 33 ఏళ్లుగా విద్యార్థుల తల్లిదండ్రులకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. 2024–25 సంవత్సరానికి తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేశం హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని విత్తన దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ రేట్లకంటే ఎక్కువ రేట్లకు విత్తనాలను విక్రయిస్తే లైసెన్స్ రద్దుచేసి చట్టపరమై చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు రశీదును భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో భూంపల్లి ఏఎస్‌ఐ భుక్యానాయక్, ఏఈఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్టు నమోదు చేస్తాం

కొండపాక(గజ్వేల్): అనుమతి లేని పురుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాయిరాం హెచ్చరించారు. మండల పరిధిలోని వెలికట్టలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. తెగుళ్ల నివారణ మందులను, విత్తనాలను విక్రయించేందుకు అనుమతి ఉందా లేదా అన్న విషయమై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. క్రయ విక్రయాల రిజిస్టరు, స్టాక్ రిజిస్టరును పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్, ఏఓ ప్రియదర్శిని, ఏఈఓ రమ్యశ్రీ దుకాణ నిర్వాహకుడు రాంచంద్రారెడ్డి, టాస్క్ బృందం సభ్యుడు ప్రేమ్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీవిత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తొగుట(దుబ్బాక): కాలంచెల్లిన, కల్తీవిత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తొగుట ఎస్‌ఐ లింగం హెచ్చరించారు. మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఏవో మోహన్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. తాము తరచుగా దుకాణాలను తనిఖీ చేస్తామని, రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం స్టాక్, డెలివరీ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు పరిశీలించారు.


మిరుదొడ్డలో విత్తన రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మల్లేశం

ఆకస్మిక తనిఖీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులకు కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ తాండ్ర వివేక్, ఏఈఓ శ్రీలత హెచ్చరించారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి, గుబ్బడి గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. విత్తనాల ధరల పట్టిక, స్టాక్ వివరాలు తెలిసేలా పట్టిక బోర్డు ఉంచాలన్నారు.

కూల్చిన ఇళ్లను నిర్మించాలి

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేటరూరల్: 2019లో సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన కొందరి ఇళ్లను పునరావాసం పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూల్చివేసిన ఇళ్లను తిరిగి నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. మంగళవారం సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనుల చేపట్టాలని కోరుతూ కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో పాక్షికంగా ధ్వంసమైన ఇళ్లను గుర్తించి ఇల్లు కట్టిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి కూల్చివేసిందన్నారు. ఇల్లు నష్టపోయిన వారికి తిరిగి ఇల్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధి ఇర్కోడ్ గ్రామంలో సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి 1.20 గుంటల స్థలాన్ని కబ్జా చేశారని, దానిపై విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నంగునూరు మండల అధ్యక్షుడు శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు వహాబ్, అజ్మత్, అలీ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం దృష్ట్యా అన్ని చోట్ల పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని ఎస్టీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పానుగంటి నర్సింహాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్ సబ్జెక్టు టీచర్లను నియమించాలన్నారు.

◆ కేంద్రంలో రానున్నది మోదీ ప్రభుత్వమే

చిన్నకోడూరు(సిద్దిపేట): భారత దేశాన్ని ప్రపంచ దేశాలు గర్వించేలా సమున్నత స్థానంలో నిలుపుతున్న ప్రధాని నరేంద్రమోదీ మరోసారి దేశ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ పది స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధించి మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ నిలవబోతున్నారన్నారు. దేశ అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి, దేశ, ధర్మ రక్షణకు మోదీ తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలే మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువస్తున్నాయన్నారు. మెదక్ పార్లమెంట్‌లో రఘునందన్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు.

◆ రఘునందన్‌రావును కలిసిన నాయకులు

తొగుట(దుబ్బాక): బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును మండల నాయకులు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం నాయకత్వంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, బుచ్చిరాజం, రాజు పాల్గొన్నారు.

◆ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ గోనె మార్కండేయులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్యన్నారు. వ్యవసాయానికి సాగునీరు, కరెంట్, విత్తనాలు అందించలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరుకుందని విమర్శించారు. రైతులపై లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

◆ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాకటౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు హెచ్చరించారు. మంగళవారం దుబ్బాకలో సైబర్ నేరాలు, 100 కాల్‌పై అవగాహన కల్పించారు. మారుతున్న కాలంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలపై 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

◆ పోరాటం వల్లే తెలంగాణ ఏర్పాటు

సిద్దిపేటజోన్: సబ్బండ వర్గాల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, సోనియా గాంధీ ఇస్తేనే వచ్చిందనే ప్రచారం చేయడం సరికాదని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో పార్టీ అధికార ప్రతినిధి మోహన్ లాల్, మాజీ ఆర్టీఏ మెంబర్ ఈర్షద్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి తెలంగాణ సాధించిన విషయం చరిత్రలో ఉంటుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాన్ని తెచ్చుకున్న విషయం కాంగ్రెస్ గుర్తించుకోవాలన్నారు.

◆ వేసవి శిబిరంతో చిన్నారులకు లబ్ధి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆధ్యాత్మిక వేసవి శిబిరంతో చిన్నారులకు లబ్ధి చేకురుతుందని బ్రహ్మకుమారి భవానీ అన్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలానంద ఆధ్యాత్మిక వేసవి శిబిరంలో కథల తాతయ్య, కవి ఎన్నవెళ్లి రాజమౌళి, మిమిక్రీ కళాకారుడు రమేష్, డెంటిస్ట్ డాక్టర్ స్వాతి చిన్నారులకు సంస్కృతి, సాంప్రదాయాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు స్వప్న, బింధు, ఓంకార్, ఉదయ్ పాల్గొన్నారు.

◆ మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

గజ్వేల్‌రూరల్: మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద మంగళవారం రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టప్రకారం నేరమన్నారు. నంబర్ ప్లేటులేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిని పట్టుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఎల్లమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ పూజలు


ఎల్లమ్మకు పూజచేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ ఎల్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.